ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 16 మార్చి 2025



ఇంత నిర్లక్ష్యమా..?

ఇష్టారాజ్యంగా పది పరీక్షల ఇన్విజిలేషన్

అంధులు, బాలింతలు, దివ్యాంగులకు విధులు

అనంతపురం విద్య, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణ విషయంలో గందరగోళం కనిపిస్తోంది. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం, ఉన్నతాధికారులు నిర్లక్ష్యం కారణంగా ఇష్టారాజ్యంగా ఇన్విజిలేషన్ విధులను కేటాయించారనే విమర్శలు వస్తున్నాయి. పదో తరగతి పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 135 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 17 నుంచి పరీక్షలు మొదలవుతాయి. ఇప్పటికే ఉపాధ్యాయులకు ఇన్విజిలేషన్ విధులకు కేటాయించారు. అనంతపురం డివిజన్‌లో 855 మందికి, గుత్తి డివిజన్‌లో 856 మందికి డ్యూటీ వేశారు. కానీ కొందరికి శనివారం వరకూ ఉత్తర్వులు అందలేదు. ఈ కారణంగా చీఫ్ సూపరింటెండెంట్ల దగ్గర రిపోర్ట్ చేసుకోలేదు.

వారికీ విధులా..?

కళ్లులేని టీచర్లకు కూడా పరీక్షల విధులు కేటాయించారు. చంటిబిడ్డల తల్లులు, దివ్యాంగులకు సైతం విధులు కేటాయించారు. అనంతపురం రూరల్ ప్రాంతంలోని ఓ కళ్లులేని టీచర్‌కు డ్యూటీ వేశారు.

మెడికల్ లీవ్ ఉన్న టీచర్లు, దివ్యాంగ టీచర్లు, బాలింతలకు సైతం ఇన్విజిలేషన్ డ్యూటీ వేశారు. ఐటీ సెల్‌లో టీచర్ల సమగ్ర సమాచారం ఉంటుంది. అయినా ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఐటీ సెల్‌ను ఇన్వాల్ చేయకపోవడం, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, పరీక్షల విభాగం మధ్య సమన్వయం కనిపించడం లేదు. కొందరు టీచర్లకు డబుల్ డ్యూటీ కూడా వేశారు. విమర్శలు రావడంతో తేరుకుని సర్దుబాటుకు సిద్ధమయ్యారు. కలెక్టర్ నుంచి అక్షింతలు పడటంతో పరీక్షల విభాగం అధికారులు ఆలస్యంగా మేలుకున్నారు. కళ్లు లేనివారికి, దివ్యాంగులకు మినహాయింపు ఇచ్చి, విల్లింగ్ ఉన్నవారికి ఇన్విజిలేషన్ డ్యూటీ వేశారు.

విద్యారణ్య నగర్‌లో అక్రమ నివాసాలంటూ ఇళ్ల కూల్చివేత

సమయం ఇవ్వాలని వేడుకున్న బాధితులు

కోర్టు ఉత్తర్వులు మేరకు తొలగింపు: రెవెన్యూ అధికారులు

గూడు కూలింది.. గుండె చెరువైంది..!



ఇళ్లను ఖాళీ చేసేందుకు సమయం కోరుతున్న బాధితులు



కూల్చివేతను నిలిపివేయాలని బైఠాయించిన టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ స్థలంలో నాలుగు దశాబ్దాలుగా ఉంటున్న ఇళ్లను రెవెన్యూ అధికారులు శనివారం నేల మట్టం చేశారు. ఇళ్లను ఖాళీ చేసేందుకు సమయం ఇవ్వాలని నివాసిస్తున్నవారు వేడుకున్నా ఫలితం లేకపోయింది. కోర్టు ఉత్తర్వుల పేరుతో పోలీసుల సహకారంలో కూల్చేశారు. దీంతో అక్కడ నివాసం ఉంటున్నవారు కన్నీటిపర్యంతమయ్యారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేట పంచాయతీ పరిధిలోని విద్యారణ్య నగర్‌లో రెవెన్యూ అధికారులు శనివారం ప్రైవేట్ స్థలంలోని ఇళ్ల తొలగింపు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి పోలీసుల బలగాల మధ్య ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో తొలగింపు చర్యలు చేశారు. వారు మాట్లాడుతూ పాపంపేట సర్వే నెంబరు 106-1లో 68సెంట్ల శ్రోత్రియం భూమి ఉందన్నారు. 1983లో గొల్లపల్లి లక్ష్మీకాంతారావు, లక్ష్మీనరసయ్య తమ స్థలాన్ని ఆక్రమించుకొని నివాసం ఉన్నారని..వాటిని తొలగించి తమకు కేటాయించాలని ల్యాండ్ గ్రాబింగ్ కోర్టును ఆశ్రయించారన్నారు. ఆమేరకు 1990లో కోర్టు నివాసాలను తొలగించి హక్కుదారులకు కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అది జరగలేదన్నారు. ఈక్రమంలో స్థానికంగా నివాసము న్న వారు హైకోర్టులో 12, సుప్రీంకోర్టులో మూడు పిటిషన్లు దాఖలు చేశారన్నారు. సుప్రీంకోర్టు పిటిషన్లు తిరస్కరించిందన్నారు. హైకోర్టు పిటిషన్లపై భూ హక్కుదారుల మనవడు శ్రావణ్ కుమార్, నివాసదారుల మధ్య వాదనలు జరిగాయి. హైకోర్టు కూడా 2021లో ల్యాండ్ గ్రాబింగ్ కోర్టు ఉత్తర్వుల అమలు చేయాలని తీర్పు నిచ్చింద న్నారు. అప్పటి నుంచి శ్రావణ్ తన భూమిని స్వాధీన పరచాలని కోర్టు ఆశ్రయించారన్నారు. గత ఏడాది డిసెంబరు 5న స్థానికంగా ఉన్న ఇళ్లను తొలగించి స్వాధీన పరచాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఆమేరకు వారం పది రోజులుగా స్థానికులకు నోటీసులు ఇవ్వడంతో పాటు ఇళ్లను ఖాళీ చేయాలని చెప్పిందన్నారు. ఈక్రమంలోనే తొలగింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

సమయం ఇవ్వాలని వేడుకోలు..

ఇళ్ల తొలగింపు నేపథ్యంలో నివాసదారులు ఇళ్ల ఖాళీకి సమయం ఇవ్వాలని వేడుకున్నారు. బాధితుల తరఫున స్థానిక టీడీపీ నాయకులు ఎక్స్‌కవేటర్లను అడ్డుకున్నారు. మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, రామాంజినేయులు, బాబావలి, లక్ష్మీదేవి, భరత్, దస్తగిరి, గోవిందు తదితర నాయకులు స్థానికంగా బైఠాయించారు. ఇళ్ల ఖాళీ చేసేందుకైనా పది,పదిహేనురోజులు గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా నలభై ఏళ్లుగా ఇల్లు కట్టుకొని నివసిస్తున్నా వారి ఇళ్లను కూల్చివేయడం సమంజసం కాదని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి విమర్శించారు. ఇళ్ల కూల్చివేత క్రమంలో బాధితులను పరామర్శించడానికి రామిరెడ్డితో పాటు జిల్లా కమిటీ సభ్యుడు ముత్తుజా అక్కడి రావడం జరిగింది. ఈక్రమంలో పోలీసులు వారిని అడ్డుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.





ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సొంతూరి బాటపట్టారు. పరీక్ష ముగియగానే అనంతలోని సెంటర్ల వద్ద శనివారం సంబరాలు చేసుకున్నారు.

ఓ పెళ్లి ప్రయత్నం...
రెండు ఆత్మహత్యలు

(వివరాలు 7లో...)

హ్యాపీ బర్త్‌డే.. నాన్నా..!



మేకపోతుకు బర్త్‌డే కేక్ తినిపిస్తున్న వెంకటేశులు

మేకపోతును చూస్తే మాంసాహారులకు ఏమనిపిస్తుందో చెప్పాల్సిన పనిలేదు. ఎంత ఖర్చు చేసి పెంచినా.. చివరకు అమ్మేస్తారు.. లేదా ఆరగించేస్తారు. కానీ కళ్యాణదుర్గం మండలం బోయలపల్లికి చెందిన వెంకటేశులు మాత్రం ఆ మేకపోతును చనిపోయిన తన తండ్రికి ప్రతిరూపంగా చూసుకుంటున్నారు. మూడేళ్ల క్రితం రూ.15 వేలకు కొనుగోలు చేసి, దానికి తన తండ్రి పేరు 'సుంకప్ప' అని నామకరణం చేశారు. గ్రామంలోని సుంకమ్మ దేవత ఆలయంలో పూజారిగా ఉంటున్న ఆయన.. 'సుంకప్ప'కు మనుషులు తీసుకునే ఆహారాన్నే పెడుతున్నారు. అన్నం, బ్రెడ్లు, బొరుగులు, చిక్కీలు.. వీటితో పాటు ఇంట్లో తినేందుకు వండుకున్న ఆహార పదార్థాలను కూడా వడ్డిస్తుంటారు. అప్పుడప్పుడు మాత్రమే పచ్చగడ్డి వేస్తుంటారు. అలా.. ఇంట్లో 'మనిషి'లా చూసుకుంటున్న 'సుంకప్ప' పుట్టిన రోజు వేడుకను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి మరీ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్థులను ఆహ్వానించి, అందరి సమక్షంలో 'సుంకప్ప'గారి చేత కేక్ కట్ చేయించారు. అతిథులకు స్వీట్లను పంచిపెట్టారు. ఈ వేడుకకోసం ఇంటి వద్ద విద్యుత్ దీపాలను కూడా ఏర్పాటు చేశారు. సుమారు 50 మందికి భోజనాలు పెట్టారు. ఈ పుట్టిన రోజుకు రూ.12 వేలకు పైగా ఖర్చు చేశారు. మూడేళ్లుగా ఇలా 'సుంకప్ప' పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తున్నారు. 'మా నాన్న ఆత్మశాంతి కోసం.. మా కుటుంబ సంతోషం కోసం.. ఈ వేడుక' అని అంటున్నారు వెంకటేశులు. - ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం

పది విద్యార్థులకు
ఉచిత ప్రయాణం

7

కమీషన్ల గ్రహణం..!

సిమెంటు రోడ్ల నిర్మాణానికి అధికారి మోకాలడ్డు

కమీషన్ ఇస్తేనే పచ్చజెండా లేదంటే కొర్రీలే..

ఆగిన రూ.80లక్షల విలువైన పనులు



ఇది పుట్లూరు మండలం వెంగన్నపల్లిలోని రోడ్డు. గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసి నాలుగు నెలలవుతోంది. నేటికీ పనులు ప్రారంభించలేదు. ఏ రోడ్డు వేస్తారో కూడా తెలీదు. నిధులున్నా.. రోడ్డు వేయకపోవడం శోచనీయం. ఓ అధికారి కమీషన్ల కక్కుర్తి ఫలితంగా గ్రామంలో రోడ్లు ఇలా దర్శనమిస్తున్నాయి.

పుట్లూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణం ఊసేలేదు. ఏ ఊరి కెళ్లినా గోతుల రోడ్లతో జనం నరకం అనుభవించారు. కూటమి అధికారం చేపట్టాక ముమ్మరంగా రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అందుకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. పుట్లూరు మండలంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రోడ్ల పనులు ముందుకు కదలడం లేదు. ఓ అధికారి కమీషన్ల కక్కుర్తి కారణంగా రోడ్ల పనులకు గ్రహణం పట్టిందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కమీషన్ ముట్టజెబితేనే ఆ అధికారి పనులకు పచ్చజెండా ఊపుతారట. లేదంటే రోడ్డు నిర్మాణానికి నిధులు చాలవనీ, మరోచోట వేద్దామంటూ కొర్రీలు వేస్తారట. ఇలా మండలంలో చాలా పనులు మొదలవలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. అధికారి మోకాలడ్డుతుండడంపై మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభంకాని పనులు

మండలవ్యాప్తంగా 55 పనులకుగాను రూ.2 కోట్ల మేర ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సిమెంటు రోడ్డు నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో కమీషన్ ఇవ్వకపోవడంతో పనులు ప్రారంభించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తక్కళ్లపల్లి, సూరేపల్లి, జి. వెంగన్నపల్లి, అరకటవేముల, చెర్లోపల్లి, కడవకల్లు, కోమటికుంట్ల తదితర గ్రామాల్లో రూ.80లక్షల మేర సీసీ రోడ్ల నిర్మాణాలు ప్రారంభించలేదని సమాచారం.

అధికారి కొర్రీలు

యల్లనూరు మండలంలోని ఓ సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు మండల ఇంజనీర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన మండలానికి అడపాదడపా వచ్చిపోతున్నారు. ఆయనకు బాధ్యతలు అప్పగించడం వెనుక అంతర్యమేమిటో ఉన్నతాధికారులకే తెలియాలి. సిమెంటు రోడ్డు వేయాలంటే ముందుగా గ్రామంలో కాలనీలను పరిశీలించాల్సి ఉంటుంది. ఆయన మాత్రం తాను చెప్పినచోటే వేయాలని పట్టుబడుతున్నారట. లేదంటే రోడ్డు నిర్మాణం వాయిదా వేస్తాడన్న ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం పనులు ప్రారంభించని గ్రామాల్లో పరిశీలించకుండా కంకర, ఇసుక తదితర మెటీరియల్ రవాణా చేసుకోండని చెబుతారట. క్షేత్రస్థాయికి వెళ్లినపుడు అక్కడ వద్దనీ, మంజూరైన నిధులు చాలవనీ, మరోచోట రోడ్డు నిర్మాణం చేపడదామంటూ కొర్రీలు వేస్తున్నారట. మరికొన్ని గ్రామాల్లో కమీషన్ ఇవ్వకపోవడంతో మార్కింగ్ కూడా వేయలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎంత మెటీరియల్ రవాణా చేసుకోవాలో వివరాలు చెప్పడని తెలుస్తోంది. ఈ పనులన్నీ కమీషన్ ఇవ్వకపోవడం వల్లే ఆగిపోయాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

విషయం నా దృష్టికి రాలేదు



మండలంలో కొన్ని గ్రామాల్లో సిమెంటు రోడ్ల పనులు ప్రారంభించలేదని నా దృష్టికి రాలేదు. సంబంధిత అధికారితో మాట్లాడి నిర్మాణాలు వేగవంతం చేస్తాం. 40కిపైగా రోడ్లు పూర్తిచేశాం. మిగిలిన వాటిని కూడా పూర్తి చేస్తాం. సిమెంటు రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకుంటాం.

- అలివేలమ్మ, ఎంపీడీఓ, పుట్లూరు

ముగిసిన ఇంటర్ పరీక్షలు

చివరి రోజు 424 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రధాన పరీక్షలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు 424 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 19,811 మందికిగాను 19,450 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,294 మందికిగాను 1,231 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్ 3 కేంద్రాలు, సభ్యులు 4 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ 10 కేంద్రాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్ 13 కేంద్రాలను, కస్టోడియన్లు 11 కేంద్రాలను తనిఖీ చేశారు.

చంద్రబాబు అంటే ఒక బ్రాండ్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



అనంతపురం అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు అంటే ఒక బ్రాండ్ అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ప్రధాన మంత్రుల కంటే ఎక్కువ ప్రాధాన్యం సీఎం చంద్రబాబుకు ఉందని అన్నారు. ఒకప్పుడు విజన్-2020 అంటే కొందరు ఎగతాళి చేశారని, కానీ అది సక్సెస్ అయ్యి లక్షలాది ఉద్యోగాలు తెచ్చిపెట్టిందని అన్నారు. నేడు స్వర్ణాంధ్ర విజన్-2047తో పౌరుల తలసరి ఆదాయం రూ.35 లక్షలకు పెంచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ఆయన బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు చంద్రబాబును అనుసరిస్తూ పాలన సాగించాయని అన్నారు. ఓ వైపు టెక్నాలజీ.. మరో వైపు వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తూ, నదుల అనుసంధానం చేస్తూ పాలనలో ఆయనకు ఎవరూ సాటిలేరని నిరూపించుకున్నారని అన్నారు. వైఎస్ జగన్‌రెడ్డి లాంటి దుష్ట శక్తులు ఆయన్ను దెబ్బతీయాలని చూసినా, చివరకు జైలు పాలు చేసినా ఆయన వెనక్కు తగ్గలేదని అన్నారు.

ఉష్ణోగ్రతలు


శనివారం	
గరిష్ఠం	39.0
కనిష్ఠం	21.0

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.31 (ఆదివారం సాయంత్రం)
సెహరీ : 5.1 (సోమవారం ఉదయం)

ప్రాణాంతక వ్యాధుల నుంచి అభయం

నేడు జాతీయ టీకా దినోత్సవం



టీకా.. జీవితకాలం రక్ష!

టీకా ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుతుంది. పుట్టిన బిడ్డకు, తల్లిపాల తరువాత ఎక్కువ రక్షణ ఇచ్చేది టీకా. అందుకే పిల్లలకు నిర్దిష్ట సమయంలో టీకాలు వేయిస్తుంటారు. అవి చిన్నారులకు క్షయ, కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, పోలియో, తట్టు, కామెర్లు, మెదడువాపు, నిమోనియా నుంచి రక్షణ కల్పిస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. 1995 మార్చి 16న దేశంలో నోటి ద్వారా తీసుకునే టీకా మొదటి డోస్ ఇచ్చారు. అమెరికన్ వైరాలజిస్టు, వైద్య పరిశోధకుడు జోనస్ సాల్క తయారు చేసిన పోలియో టీకాలను చిన్నారులకు వేశారు. ఉద్యమంలా ఓరల్ పల్స్ పోలియో డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అందుకు చిహ్నంగా ఏటా మార్చి 16న జాతీయ టీకా దినోత్సవం పాటిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, కదిరి అర్బన్

టీకా ప్రాముఖ్యత

● అప్పుడే పుట్టిన బిడ్డకు 15 రోజులలోపు '0' డోస్ ఓపీవీ టీకా ఇవ్వాలి.

డీసీజీ వ్యాక్సిన్

ట్యూబర్ క్యులోసిస్ (టీబి) రాకుండా ఈటీకా వేస్తారు. జీవితంలో టీబీ ప్రతిఒకరికీ ఏదో ఒక దశలో వస్తుంది. అలా వచ్చినపుడు దాని తీవ్రతను తగ్గించేందుకు టీకా ఉపయోగపడుతుంది. చాలా మందికి టీబీ వచ్చిన, తగ్గిపోయిన విషయం కూడా తెలియదు.



హెపటైటిస్ బి

బిడ్డ పుట్టిన 24గంటల్లోపు 0.05 ఎం.ఎల్. తొడ వెలుపలి భాగంలోని కడరానికి ఇవ్వాలి.దీని ద్వారా చిన్నారులకు కామెర్లు, పెద్ద వయసులో వచ్చే లివర్ సంబంధిత క్యాన్సర్‌ను నివారించవచ్చు.

రోటావైరస్

6, 10, 14 వారాల్లో నోటి ద్వారా ఐదు చుక్కలివ్వాలి. రోటావైరస్ వల్ల కలిగే విరేచనాల నుంచి ఈ టీకా రక్షణ కల్పిస్తుంది. ఆస్పత్రిలో చేరి సెలైన్ ఎక్కించుకోవాల్సిన అవసరాన్ని, పోషకాహార లోపాన్ని తగ్గిస్తుంది.



పెంటావాలెంట్ టీకా

ఈటీకా అత్యంత ప్రధానమైనది. ఐదు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. బిడ్డ పుట్టిన 6, 10, 14 వారాల్లో 0.05 ఎం.ఎల్. ఎడమ తొడ వెలుపలి భాగంలో కండరంలోకి ఇస్తారు. కంఠసర్పి, కోరింత దగ్గు, శిశుపక్షపాతం, కామెర్లు, నిమోనియా, మెదడువాపు, చెవిటితనం రాకుండా నివారిస్తుంది. ఏడాదిలోపు చిన్నారులకు మాత్రమే ఈ టీకా ఇవ్వాలి.

ఎంఆర్ టీకా

9 నెలలు నిండిన చిన్నారులకు ఎంఆర్ టీకా 0.05 ఎం.ఎల్. కుడి భుజాన చర్మం కింద ఉన్న కొవ్వు పొరల్లోకి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ టీకాతో పిల్లలను తట్టు నుంచి కాపాడవచ్చు.

విటమిన్ ఎ ద్రావణం

దీనిని 1, 2, 5 సంవత్సరాల వరకు ఆరు నెలలకోసారి మొత్తం 9 డోస్‌ల వరకు 2 ఎం.ఎల్. నోటి ద్వారా ఇవ్వాలి. తద్వారా చిన్నవయసులో వచ్చే శ్వాసకోశ, జీర్ణకోశ, కంటి, చర్మవ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.

బూస్టర్ డోస్

16 నుంచి 24 నెలలలోపు ఓపీవీ, డీపీటీ-1, ఎంఆర్-2, జేఈ-2, విటమిన్ ఎ ద్రావణం ఇవ్వాలి. ఐటీవీ టీకా పోలియాను నిరోధిస్తుంది. పోలియో వ్యాక్సినేషన్ మూడు డోసులిస్తారు. మొదటి డోసు రెండు మాసాలకు, రెండు, మూడు డోసులు 9నుంచి 15 నెలల వ్యవధిలో ఇస్తారు.

వరిసెల్లా వ్యాక్సిన్

చికెన్ ఫాక్స్‌ను నిరోధించడానికి ఈ వ్యాక్సిన్ ఉపయోపడుతుంది. ఏ వయసు వారైనా తీసుకోవచ్చు. పిల్లలు రెండు డోసులు తీసుకోవాలి. 15 నెలలకు ఒకటి, 18 నుంచి 21 నెలల మధ్య మరో డోసు తీసుకోవాలి. ఐదు డోసులు టీడీఏపీ టీకా వేస్తారు.

మొదటి డోసు రెండు నెలలకు, రెండోది నాలుగు నెలలకు ఇస్తారు. తరువాత ఆరు నెలల వయసులో ఒకటి, 15 నుంచి 18 నెలల మధ్యలో మరొకటి, 4 నుంచి 6 ఏళ్ల వయసులో మరో డోసు ఇస్తారు.

క్యాచ్ అఫ్ వ్యాక్సినేషన్

నేషనల్ ఇమ్యునైజేషన్ షెడ్యూల్ ప్రకారం ఒక్కో టీకాను ఒక్కో నిర్థిష్ట సమయంలో వేయించుకోవాల్సి ఉంటుంది. అలా టీకాలను సమయానికి వేయించుకోకపోతే వారికోసం క్యాచ్ అఫ్ వ్యాక్సినేషన్ ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వ్యాక్సినేషన్ సమయానికి తీసుకోనివారి కోసం వారు ఆపేసిన దగ్గరనుంచి వ్యాక్సిన్ తీసుకునేలా షెడ్యుల్ ఇవ్వడమే క్యాచ్ అఫ్ వ్యాక్సినేషన్. ముందుగా వైద్యులను సంప్రదించి, వారి సూచన మేరకు వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది.

పెద్దయ్యాక తీసుకోవచ్చా?

కొంతమంది చిన్నతనంలో టీకాలు తీసుకోకుండా ఉంటారు. ఆ టీకాలను పెద్దయ్యాక తీసుకోవచ్చా అనే అనుమానం కూడా చాలామందికి ఉంటుంది. చిన్నతనంలో వేయించుకోని టీకాలను పెద్ద వయసులో అనవరం లేదని వైద్యులు అంటున్నారు. రెండేళ్ల వయసులో చికెన్‌ఫాక్స్ వ్యాక్సిన్ తీసుకోని వారికి 12 ఏళ్ల వరకు క్యాచ్ అఫ్ వ్యాక్సీన్ వేస్తారు. ఆ చిన్నారికి నాలుగో ఏటే చికెన్ ఫాక్స్ వచ్చి తగ్గిపోయి ఉంటే, వ్యాక్సీన్ అవసరం లేదు.

ఎవరు వేసుకోకూడదు?

కొన్ని సందర్భాల్లో కొంతమంది కొన్నిరకాల టీకాలను వేసుకోకూడదని వైద్యులు సూచిస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు ఉన్నపుడు టీకాలు వేయించరాదు. తగ్గిన తరువాత వేయించాలి. ఒకేరోజు ఎన్ని టీకాలైనా పిల్లలకు ఇవ్వచ్చు. మళ్లీ నాలుగు వారాల వరకు ఇవ్వకూడదు. పల్స్ పోలియో కార్యక్రమం, రేబిస్ టీకాలకు ఈ షరతు వర్తించదు. వరిసెల్లా, ఎంఆర్ వంటి టీకాలను రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే గర్భవతులు, హెచ్ఐవీ పీడితులు తీసుకోకూడదు.

వ్యాధి నిరోధిక శక్తి పెరుగుతుంది



వ్యాధుల నుంచి టీకాలు రక్షణ కల్పిస్తాయి. వ్యాధి నిరోధిక శక్తి పెంచుతాయి. పుట్టిన బిడ్డకు వైద్యుల సలహాతో టీకాలు వేయించాలి. ఈవిషయంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. టీకాల ద్వారా లభించే రోగనిరోధిక శక్తి ఏళ్ల తరబడి రక్షణగా ఉంటుంది. నిర్దిష్ట వ్యాధులను నియంత్రించడం, నిర్మూలించడంలో టీకాలు ఎంతో ఉపయోగపడతాయి.

- శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

జైనపీఠం.. పెనుకొండ

పాదబెట్టపై మునుల అంత్యక్రియలు

బండలపై పాదాలు చెక్కించడం ఆనవాయితీ



పెనుకొండ పట్టణంలోని పాదబెట్ట

పెనుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రసిద్ధి చెందిన నాలుగు జైన పీఠాల్లో పెనుకొండ ఒకటిగా భాసిల్లింది. పెనుకొండ అంటే విజయనగర రాజులు పాలించిన ప్రాంతంగానే అందరికి తెలుసు. కానీ పెనుకొండ ఓ ప్రసిద్ధ జైన పీఠమని బయటి వారికే కాక చాలామంది స్థానికులకు కూడా తెలియదు. పెనుకొండ గ్రామంలో 11వ శతాబ్దంలో అనేక జైన కుటుంబాలు నివాసముండేవని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. జైన మతానికి చెందిన తొమ్మిది మంది తీర్థంకరులకు సంబంధించిన దేవాలయాలు ఉండేవి. ప్రస్తుతం పచ్చా పార్శ్వనాథ దేవాలయం, అజితనాథ దేవాలయం మాత్రమే ఉన్నాయి. ఈ ఆలయాల్లో నేటికీ పూజలు కొనసాగుతున్నాయి. వీటితోపాటు 16వ తీర్థంకరుడైన శాంతినాథ దేవాలయం కూడా ఉండేది. ఆయన విద్యాపీఠాన్ని స్థాపించినట్లు 12వ శతాబ్దంలో భాస్కర్‌కవి రచించిన జీవంధార చరిత్ర గ్రంథంలో పొందుపరిచారు. ప్రస్తుతం పెనుకొండలో రెండు జైన కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి.



కొండపైన రాతి గుహ

జైనమునుల క్షేత్రం

ప్రసిద్ధ జైన క్షేత్రమైన పెనుకొండకు ఆకాలంలో అనేక మంది జైన మనులు వచ్చేవారు. వారు ఇక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకుని, ధాన్యంలో నిమగ్నమైనట్లు ఆధారాలు చెబుతున్నాయి. ఈ దిగంబర జైన మునులు చనిపోతే వైజంక్షన్ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న పాదబెట్ట అని పిలువబడే కొండపై అంత్యక్రియలు నిర్వహించేవారు. అక్కడే చనిపోయిన వారి స్మారకంగా వారి పాదాలను గుట్ట బండలపై చెక్కించడం ఆనవాయితీ. దీనికారణంగానే ఈ కొండకు పాదబెట్ట అనే పేరు వచ్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. 1966లో అజితకీర్తి మహరాజ్ దిగంబర ముని చనిపోగా ఈ కొండపైనే ఆయనకు అంత్యక్రియలు నిర్వహించి పాదాలను చెక్కించారు. ఈయనతోపాటు చంద్ర సాగర వరుణి ఐలక్ ముని పాదాల గుర్తును చెక్కించారు. దీని సమీపంలోని గుట్టపై 10వ తీర్థంకరుడు శీతలనాథ విగ్రహం, పంచ పరమేశ్వరుడి విగ్రహాలు, యక్షిణి విగ్రహాలు దానిపక్కనే పార్శ్వనాథస్వామి పద్మాసనం భంగిమలో చెక్కబడిన విగ్రహాలను బండలపై చెక్కారు.



గుహలో చెక్కిన జైన మునుల చిత్రాలు

నేడు వార్షిక పూజలు



పచ్చా పార్శ్వనాథస్వామి ఆలయంలో ఈనెల 16న వార్షిక మహోత్సవ పూజలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు అజిత ప్రసాద్ జైన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జైన స్వాములు శాంతిశ్రీ స్వామిజీ, భువనకీర్తి భట్టారక, భట్టాచార్య, చంద్రకీర్తి, హారతి, రాజేంద్రప్రసాద్, శ్రీయ జైన్, రాజన్ తదితరులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

పెద్దపేటలో చోరీ

యాడికి, మార్చి15(ఆంధ్రజ్యోతి): వేసిన తాళాలు వేసినట్లే ఉన్నప్పటికి ఇంటిలో ఉన్న 15తులాల బంగారు నగలు, రూ.20వేలు చోరీ అయిన సంఘటన పెద్దపేట గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన మేరకు పెద్దపేట గ్రామానికి చెందిన సంజీవరాయుడు ఇంటిలోని బీరువాలో ఉన్న బంగారునగలు, నగదు ఎప్పుడు మాయమయ్యాయో తెలియదు. శుక్రవారం సాయంత్రం బీరువా తెరిచి చూడగా అందులో ఉన్న 15తులాల బంగారునగలు, రూ.20వేలు నగదు కనిపించకుండా పోయినట్లు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడని తెలిపారు. ఆరాతీసిన పోలీసులు ఇంటిలోని బీరువాకు వేసిన తాళాలు వేసినట్లే ఉన్నప్పుడు బంగారం, నగదు ఎవరు ఎత్తుకువెళతారని మందలించి పంపినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

బొమ్మనహాళ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. బొమ్మనహాళ్‌కు శనివారం ఉదయం చివరి రోజు పరీక్షలు రాసేందుకు వచ్చి సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

పుట్లూరు, మార్చి15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో నాగరాజు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన నవీన్‌తోపాటు మరో ముగ్గురు కలిసి దాడి చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. వడ్డెర కాలనీలో ఇంటివద్ద సందులో నాగరాజు కట్టెల మోపు తీసుకు వస్తుండగా ఇరువురు మాటామాటా అనుకున్నారు. ఈక్రమంలోనే నవీన్ మరో ముగ్గురు కలిసి కట్టెలతో దాడి చేశారన్నారు. నాగరాజుకు గాయాలు కావడంతో తాడిపత్రి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం

గుమ్మఘట్ట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెంపల్లి గ్రామ సమీపంలో రైతు గోనబావి కృష్ణయ్యకు చెందిన మూడెకరాల మొక్కజొన్న పంట శనివారం మధ్యాహ్నం పూర్తిగా దగ్ధమైంది. రైతు కృష్ణయ్య పొలం సమీపంలో మరో రైతు పొలం గట్టుమీద ఎండిన గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఆ మంటలు వ్యాపించి మొక్కజొన్న పంట మొత్తం పూర్తిగా దగ్ధమైంది.

రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ ఆయా మృతి

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని గూబనపల్లి మలుపు వద్ద శనివారం ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో అంగన్‌వాడీ ఆయా లక్ష్మీదేవి(40) దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన మేరకు బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, తన భర్త వన్నూరుస్వామితో కలిసి ద్విచక్ర వాహనంపై కళ్యాణదుర్గం బయల్దేరారు. గూబనపల్లి మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పిల్లర్‌ను ఢీకొంది. దీంతో లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వన్నూరు స్వామిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలికి సంతానం లేదు.

విద్యుదాఘాతంతో వ్యక్తి ..

పుట్లూరు, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకునిపల్లి గ్రామానికి చెందిన రామమునిరెడ్డి (40) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడని ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. రామమునిరెడ్డి పుట్లూరు పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ లైన్‌మన్‌గా పని చేసేవాడు. ఇందులో భాగంగా శనివారం ఉదయం ఓబులేసు తోట వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని ప్రధాన ఫ్యూజును మార్చడానికి ప్రయత్నిస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య వెంకటలక్షుమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఇద్దరు నిందితులకు రిమాండ్

గుంతకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను జేఎఫ్‌సీఎం కోర్టు ఐదురోజుల రిమాండు విధించిందని కసాపురం ఎస్సై టీపీ వెంకటస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. దొంగతనం కేసులో నిందితులు కొంగనపల్లికి చెందిన ఈ పులిశేఖర్, ఈ ఆనంద్ కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో వారిపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యా యన్నారు.

రైతుల ఆర్థిక స్థితిని మారుస్తాం : విప్

డి.హీరేహాళ్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రైతుల ఆర్థిక స్థితిగతులను మార్చాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కాదలూరు గ్రామంలో వివిధ సోలార్ ఎనర్జీ పారిశ్రామిక ప్రతినిధులతో కలిసి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు రాష్ట్రంలో నియంత పాలన సాగించి రైతులను నట్టేట ముంచిందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఏవైనా ప్రైవేట్ కంపెనీలు ఇక్కడికి రావడానికి సిద్ధంగా ఉన్న సమయంలో జగన్‌రెడ్డి జే టాక్స్ కట్టలేక వెనుదిరిగి వెళ్లిపోయేవని, గతంలో స్థాపించిన పరిశ్రమలు కూడా రాష్ట్రం విడిచి వెళ్లిపోయాయని తెలిపారు. దీంతో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తారన్న నమ్మకంతో నేడు అనేక పరిశ్రమలు తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం రాయదుర్గం నియోజకవర్గంలో సోలార్ ఎనర్జీ పరిశ్రమలు ముందుకు వచ్చాయని వివరించారు. ఎకరానికి సంవత్సరానికి రూ. 31 వేలు లీజు సొమ్ము ఇస్తారని, భూమి సర్వహక్కులు రైతులకే ఉంటాయని అన్నారు. తద్వారా రైతుల ఆర్థిక స్థితిగతులు మారడమే కాకుండా గ్రామాల్లో యువతకు ఉపాధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, టీడీపీ నాయకులు హనుమంతరెడ్డి, మోహన్‌రెడ్డి, నాగల్లి రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఆంజనేయస్వామికి విశేష పూజలు



బొమ్మనహాళ్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సన్నిధిలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. దేవదాయశాఖ అధికారి ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

కూలిన వంతెన



బిదురకుంతం వద్ద కూలిన వంతెన

కణేకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిదురకుంతం - వ్యాసాపురం గ్రామాల మధ్య ఉన్న వంతెన శనివారం సాయంత్రం అకస్మాత్తుగా కూలిపోయింది. ఉరవకొండ నియోజకవర్గం వ్యాసాపురం గ్రామానికి కణేకల్లు మండలం బిదురకుంతం గ్రామానికి రాకపోకలతో పాటు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు మార్గంగా ఉన్న వంతెన కూలడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. అధికారులు వెంటనే మరమ్మతులు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాలికలను మింగిన కుంట

● నీరు తాగేందుకు వెళ్లి ఇద్దరి మృతి



మృతిచెందిన బాలికలు లక్ష్మి, అరుణ వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

గార్లదిన్నె, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండకింద కల్లూరు వద్ద నీటి కుంటలో మునిగి లక్ష్మి (15), అరుణ (10) అనే ఇద్దరు బాలికలు మృతి చెందారు. కొండ కింద కొట్టాల సమీపంలోని ఆవులోళ్ల చిన్న చిన్న గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. ఈ కుటుంబాలకు చెందిన ఎనిమిది మంది చిన్నారులు కట్టెల కోసం సమీపంలోని పెన్నానదిలోకి వెళ్లారు. ఎండు పుల్లలు ఏరుకున్న తరువాత ఎండ తీవ్రతకు దాహం వేయడంతో లక్ష్మి, అరుణ నీటి కుంట వద్దకు వెళ్లారు. ఎంతసేపటికీ తిరిగిరాకపోవడంతో మిగిలిన బాలికలు అక్కడికి వెళ్లి చూశారు. అప్పటికే ఇద్దరూ నీటిలో మునిగిపోయినట్లు గుర్తించి, కేకలు వేశారు. సమీపంలో ఉన్న గొర్రెల కాపరులు వెళ్లి బాలికలను బయటకు తీశారు. అప్పటికే ఇద్దరూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి కన్నీరుమున్నీరుగా విలపించారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య, హెడ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌బాషా సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కొట్టాలలో ఉంటున్న అర్జునప్ప, గంగమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు కాగా.. లక్ష్మి చివరి సంతానం. గోపాల్, రామక్క దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు కాగా, అరుణ ఆఖరు సంతానం.

పరీక్ష కేంద్రం మార్పులో మతలబేమిటో..?

యల్లనూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తూ వస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఈ ఏడాది మాత్రం చిలమకూరు పరీక్షా కేంద్రానికి మార్చడం వెనుక ఉన్న మతలబేమిటని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రానికి 12కిలో మీటర్ల దూరంలో ఉన్న చిలమకూరు ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి యల్లనూరు నుంచి 52 మంది విద్యార్థులు, వెన్నపూసపల్లి నుంచి 17 మంది, కేజీబీవీ నుంచి 36 మంది, శారదా విద్యానికేతన్ నుంచి 30 మంది విద్యార్థులు వెళ్లి పరీక్ష రాయనున్నారు. సాధారణంగా గ్రామాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే మండల కేంద్రానికి మార్పు చేయడం పరిపాటి. కానీ ఇక్కడ మాత్రం మండల కేంద్రంలోని సెంటర్‌కు అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికి మార్పు చేయడం వెనుక ఏమైనా మతలబు ఉందా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 40ఏళ్ల నుంచి మండల కేంద్రంలోనే పరీక్ష కేంద్రం ఉంటోంది. ఈ ఏడాది మాత్రం చిలమకూరు మార్చడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. విద్యార్థులు అక్కడికి వెళ్లడానికి ఎలాంటి రవాణా సౌకర్యాలు లేవు. కనీసం బస్సుసౌకర్యం కూడా లేదు. ఈ విషయంపై ఎంఈఓ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. ముందుగా పరీక్ష కేంద్రం మార్పుపై సమాచారం లేదని, తెలిసిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు.ఈ ఏడాది పరీక్ష కేంద్రం చిలమకూరులోనే కొనసాగిస్తామని తెలిపారు. వచ్చే ఏడాది యల్లనూరులోనే కొనసాగిస్తామని వివరించారు.

యువకుడి ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని మోడల్ స్కూలు సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు ఎర్రనేల వీధికి చెందిన మోహన్ (18)శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం రాత్రి పట్టణ శివారులోని మోడల్ స్కూలు దగ్గర ఓ చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అటుగా వెళ్లిన ప్రజలు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి తండ్రి పాపన్న, తల్లి పద్మ, ముగ్గురు అక్కలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

తాడిపత్రి, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు రోడ్డులో రెండు రోజుల క్రితం వెంకటేశ్వరమ్మ ఇంటిలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి నాగేంద్ర అలియాస్ కొక్లి, సుబ్బరాయుడులను శనివారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి ద్విచక్రవాహనం, రూ.3800 స్వాధీనం చేసుకున్నామన్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ చుక్కలూరురోడ్డులో ఒక నల్లబండల ఫ్యాక్టరీని కళాచారి, వెంకటేశ్వరమ్మ దంపతులు లీజుకు తీసుకొని నిర్వహిస్తున్నారు. రెండురోజుల కిందట ఇగుడూరు గ్రామానికి చెందిన నాగేంద్ర, సుబ్బరాయుడులు ద్విచక్రవాహనంలో ఫ్యాక్టరీ వద్దకు వెళ్లారు. నాగేంద్ర ఇంటిలోకి చొరబడి వెంకటేశ్వరమ్మను బెదిరించి రూ.పది వేలు నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అందిన సమాచారం మేరకు శనివారం చుక్కలూరు క్రాస్ వద్ద ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి కూలీ మృత్యువాత

కుందుర్పి, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీమజ్జనపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కెంచయ్య (42) శనివారం చింత చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు కెంచయ్య కూలి పనిలో భాగంగా శనివారం ఉదయం చింతకాయలు కోయడానికి కర్ణాటక ప్రాంతమైన పుట్రాళ్ల పల్లి వద్దకు వెళ్లాడన్నారు. చింతకాయలు కోసే క్రమంలో కాలుజారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య నేత్ర, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

విడపనకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గంగాధరగౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆదర్శ పాఠశాలలో చేరే విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులు అన్నారు. ఓసీ, బీసీ, విద్యార్థులు రూ. 200, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ. 150 దరఖాస్తు ఫీజు చెల్లించి ఈ నెల 17 నుంచి మే 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పది విద్యార్థులకు ఉచిత ప్రయాణం

ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్



అనంతపురం కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు సంస్థ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్. ఆదోని తెలిపారు. ఈ మేరకు శనివారం తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ప్రాంతం నుంచి పరీక్షాకేంద్రం వరకు, పరీక్ష ముగిశాక తిరిగి తమ ప్రాంతం వరకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు అన్నారు. స్టూడెంట్ బస్‌పాస్ లేని పదోతరగతి విద్యార్థులు సైతం ఒరిజినల్ హాల్‌టికెట్‌ను కండక్టర్‌కు చూపి రీజియన్‌లోని అన్ని డిపోల పరిధిలోనూ ఉచితంగా ప్రయాణించవచ్చునని తెలిపారు. సోమవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు మాత్రమే ఈ అవకాశం కల్పించామని, పదోతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఆదిశేషుడిపై దేవేరుల సమేతుడైన నారసింహుడు

ఆదిశేషుడిపై నారసింహుడు

దేవేరుల సమేతంగా శ్రీవారి దర్శనం

కదిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా కదిరి నరసింహ స్వామి శనివారం శ్రీదేవి, భూదేవిల సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం అనంతరం యాగశాల నుంచి బయలుదేరిన శ్రీవారు తిరువీధుల్లో విహరించారు. సంధ్యాసమయంలో దేవేరుల సమేతుడై ఆదిశేషుడిపై దర్శనమిచ్చారు. పక్షం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో అన్ని ఉత్సవాల్లోనూ నారసింహుడు మాత్రమే దర్శనమిస్తారు. ఒక్క శేషవాహనంపై మాత్రమే అమ్మవార్ల సమేతుడిగా మాడవీధుల్లో విహరిస్తారు. ఈఉత్సవానికి తనకల్లు మండలంలోని కొక్కంటి జ్యోతి రావడం ఆనవాయితీ. ఈ ఉత్సవంలో ఆలయ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

నేడు సూర్య, చంద్ర ప్రభ వాహనం

ఆదివారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం వేళ సూర్యప్రభ, రాత్రి సమయంలో చంద్ర ప్రభ వాహనాలపై తిరువీధుల్లోభక్తులకు దర్శనమిస్తారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో 5,6,7,8,9 తరగతుల్లో ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ జోనతన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది వరకూ ఈ నెల 15వ తేదీ చివరి గడువుగా ఉండేదని, దాన్ని ఈ నెల 25 వరకూ పొడిగిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో https://mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20న జరగాల్సిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్షను మే ఐదో తేదీకి మార్చినట్లు తెలిపారు.

ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీ ఫార్మసీ, ఫార్మా-డీ, ఎంఫార్మసీ, ఎంటెక్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు తెలిపారు. బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(25) రెగ్యులర్‌తో పాటు ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ (ఆర్15,19) సప్లిమెంటరీ ఫలితాలు విడదల చేశామన్నారు. ఫార్మాడీ ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం(ఆర్17) అడ్వాన్స్, ద్వితీయ సంవత్సరం(ఆర్14), ప్రథమ సంవత్సరం (ఆర్14,17) సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఎంఫార్మసీ ద్వితీయ, నాలుగో సెమిస్టర్(ఆర్21) సప్లిమెంటరీ, ప్రథమ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీతో పాటు ఎంటెక్ నాలుగో సెమిస్టర్(ఆర్21) సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేశామని ఆయన తెలిపారు.

కదిరికి చేరిన కొక్కంటి జ్యోతి



కొక్కంటిలో బయల్దేరిన జ్యోతి

తనకల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు తనకల్లు మండలంలోని కొక్కంటి పాలేగాళ్ల జ్యోతి రావడం ఆనవాయితీ. ఆ మేరకు శుక్రవారం రాత్రి కొక్కంటిలో పూజలు నిర్వహించారు. పాలేగాళ్ల వైవీ దినకర్‌ప్రసాద్‌నాయుడు నివాసంలో ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కాలినడక జ్యోతి నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం మీదుగా శనివారం కదిరి చేరుకుంది. అక్కడ కొక్కంటి జ్యోతికి ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆలయంలో విడిది కేటాయించారు. ఉత్సవాల్లో కొక్కంటి జ్యోతి ముందుండడం ఆనవాయితీగా కొనసాగుతున్నట్లు కొక్కంటి పాగేళ్ల తెలిపారు.

పరిశ్రమల శాఖ జీఎం బదిలీ

కొత్త జీఎంగా శ్రీనివాస్ యాదవ్

అనంతపురం అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. గత ఏడాది అక్టోబరులో అనకాపల్లి నుంచి ఆయన జిల్లాకు బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి తిరిగి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన బదిలీ నేపథ్యంలో చిత్తూరు పరిశ్రమ శాఖ జీఎంగా పనిచేస్తున్న శ్రీనివాస్ యాదవ్‌ను జిల్లాకు నియమించారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

పారదర్శక పాలన అందించాలి

జిల్లా ఇన్‌చార్జి అధికారి విజయరామరాజు



మాట్లాడుతున్న విజయరామరాజు

అనంతపురం టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని పాఠశాల విద్య కమిషనర్, జిల్లా ఇన్‌చార్జి అధికారి విజయరామరాజు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా అధికారులతో శనివారం రాత్రి ఆయన సమీక్ష నిర్వహించారు. పనుల మీద వచ్చిన ప్రజలను సాదరంగా ఆహ్వానించి, గౌరవంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా, వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఎంతో ముఖ్యమైనదని, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఉద్యోగాల సృష్టి ఎంతో గొప్పదని, చట్టప్రకారం వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్నారా లేదా అనేది పరిశీలించాలని అన్నారు. వేసవి నేపథ్యంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని అమలు చేయాలని అన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, నీటిని రవాణా అవసరం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గాల్లో ఏపీఐఐసీ కింద పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూమి గుర్తించాలని సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను అన్ని పంచాయతీల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. డ్వామా కింద కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు చేరుకోవాలని అన్నారు. నియోజకవర్గానికి ఒక స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలని, అన్నిశాఖల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను జాగ్రత్తగా అమలు చేయాలని సూచించారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, ఆనంద్, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు





శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

లైనింగ్ పనులు రద్దు చేయండి

జలసాధన సమితి నాయకులు

హిందూపురం అర్బన్, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు రద్దు చేసి, కాలువ వెడల్పు చేసే విధంగా ప్రభుత్వానికి నివేదికలు పంపాలని కలెక్టర్ చేతన్‌ను జలసాధన సమితి ఉమ్మడి జిల్లా నాయకులు కోరారు. వారు ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్‌ను శనివారం కలిసి వినతి అందించారు. వారు మాట్లాడుతూ కాలువకు సంబంధించి మాల్యాల నుంచి జీడిపల్లి 216 కిలో మీటర్ల వరకు 3850 క్యూసెక్కుల సామర్థ్యం మేర నీరు వదలడానికి రూ. 696 కోట్లు, జీడిపల్లి 216 కిలోమీటర్లు నుంచి 400 కిలో మీటర్లు వరకు కాలువ లైనింగ్ చేయడానికి రూ. 936.7 కోట్లను ప్రభుత్వం జీఓ 404, 405ల ద్వారా విడుదల చేసిందన్నారు. కాలువ లైనింగ్ ద్వారా అధిక ఖర్చు తప్పా ప్రయోజనం ఉండదని తెలిపారు. కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, గంగిరెడ్డి, జమీల్, సిద్దారెడ్డి, తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న జలసాధన సమితి నాయకులు

కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప

పెనుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, దివంగత సాయి కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప పేర్కొన్నారు. స్థానిక శివసాయి మందిరం ప్రాంగణంలో సాయికాళేశ్వర్ 13వ వర్ధంతిని గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ న్యాయవాది గురుప్రసాద్, కాళేశ్వర్ తండ్రి సుబ్బారాయుడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ముందుగా కాళేశ్వర్ సమాధికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో శిల్ప మాట్లాడుతూ కాళేశ్వర్ పేదల సంక్షేమమే ధ్యేయం గా కులమతాలకు అతీతంగా అన్నీ వర్గాల వారికి ఎన్నో సేవా కార్యక్రమా లు చేపట్టారన్నారు. అనంతరం పెనుకొండలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం కోసం పోలీసులకు రూ.28లక్షల చెక్కును అందజేశారు. కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేసుకున్నవారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ కాళేశ్వర్ మృతి పెనుకొండ ప్రజలకే కాక జిల్లా ప్రజలకు తీరనిలోటన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, చిట్టిబాబు, హరి, బాబుప్రసాద్, ప్రగతి శ్రీనివాసులు, మానవహక్కుల జిల్లా అధ్యక్షుడు జాన్ ప్రియనాథ్, ఆశ్రమ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు చెక్కును అందజేస్తున్న శిల్ప

పర్యావరణ పరిరక్షణతోనే స్వచ్ఛాంధ్ర

ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మునిప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమవుతుందని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మునిప్రసాద్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా శనివారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నుంచి ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు మీదుగా క్లాక్‌టవర్ వరకు సాగింది. ఈ సందర్భంగా మునిప్రసాద్ మాట్లాడుతూ వాతావరణాన్ని కలుషితం చేస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, డీఐసీ జనరల్ మేనేజర్ కృష్ణమూర్తి, కార్మికశాఖ, డీఎంహెచ్ఓ కార్యాలయం, నగరపాలక సంస్థనుంచి అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విజయ్‌కుమార్, అనీల్‌కుమార్, బీవీ రెడ్డి, పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్ ర్యాలీ జెండా ఊపి ప్రారంభిస్తున్న మునిప్రసాద్

నెలాఖరు నుంచి హెచ్చెల్సీ పనులు : ఎస్ఈ

బొమ్మనహాళ్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరు నుంచి హెచ్చెల్సీ అత్యవసర పనులు ప్రారంభం అవుతాయని ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని క్రిష్ణాపురం, ఉంతకల్లు, మైలాపురం, ఉద్దేహాళ్ గ్రామ సమీపంలోని 126, 105, 109 కి.మీ. వద్ద కాలువ, వంతెనలను శనివారం ఆయన పరిశీలించారు. కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంగా లేకుండా చూడాలని స్థానిక అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 105 కి.మీ. నుంచి 189 కి.మీ. వరకు 10 పనులు రూ. 34.95 కోట్లతో జరుగుతాయన్నారు. జూలై నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. బొమ్మనహాళ్ మండలంలో రూ. 16 కోట్ల వ్యయంతో వంతెన, లైనింగ్ పనులు జరుగుతాయని తెలిపారు. నిరంతర పర్యవేక్షణ, పరిశీలన చేసి పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఈఈ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్చెల్సీని పరిశీలిస్తున్న ఎస్ఈ రాజశేఖర్

ఓ పెళ్లి ప్రయత్నం...

రెండు ఆత్మహత్యలు

మూడు రోజుల వ్యవధిలో కుమారుడు, తల్లి బలవన్మరణం



శైలజ (ఫైల్)



శ్రీచరణ్ (ఫైల్)

తాడిపత్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఓ పెళ్లి ప్రయత్నం రెండు ఆత్మహత్యలకు దారి తీసింది. బంధువులు పెళ్లి సంబంధం తల్లి వద్దన్నదని కుమారుడు మూడు రోజుల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి నువ్వే కారణమని బంధువుల సూటిపోటి మాటలు అనడంతో కలత చెందిన తల్లి శనివారం ఆత్మహత్య చేసుకుంది. భార్య, కుమారుడి అకాల మృతితో ఏకాకిగా మిగిలిన సురేంద్రబాబు రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. తాడిపత్రికి చెందిన ఓ కుటుంబ విషాద సంఘటన ఇది. వివరాలు ఇలా.. పట్టణానికి చెందిన శైలజ(42), సురేంద్రబాబు దంపతులకు ఏకైక కుమారుడు శ్రీచరణ్ (20) డిప్లొమా పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉండేవాడు. సురేంద్రబాబు కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి శ్రీచరణ్‌కు పెళ్లి సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. బంధువుల్లోనే ఓ సంబంధం ఉండగా, దాన్ని శైలజ ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన శ్రీ చరణ్ ఈనెల 12న అనంతపురం సమీపంలోని ప్రసన్నాయపల్లి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈక్రమంలో శైలజ ఒప్పుకోకపోవడంతోనే కుమారుడు చనిపోయాడని బంధువులు సూటిపోటి మాటలు అన్నారు. దీంతో మనస్తాపం చెందిన శైలజ శనివారం పట్టణ సమీపంలోని పుట్లూరు రైల్వేగేటు వద్ద రైలుకిందపడి శైలజ ఆత్మహత్య చేసుకుందని పోలీసులు శనివారం తెలిపారు. కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు.

జర్దోసి మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో జర్దోసి మగ్గం వర్క్‌పై 30రోజుల పాటు ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు అర్హులన్నారు. ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభించే ఉచిత శిక్షణకు సంబంధించి పేర్ల నమోదు, వివరాలకు సెల్ నంబరు 9492583484ను సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

రేపు బడ్జెట్ సమావేశం

అనంతపురం క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థకు సంబంధించిన 2025-26ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశాన్ని ఈ నెల 17వ తేదీ బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ బాలస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలిక కౌన్సిల్ హాల్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆశా వర్కర్‌కు గాయాలు


గాయపడ్డ ఆశావర్కర్ పద్మావతి

శింగనమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికిచెందిన ఆశా వర్కర్ పద్మావతి ద్విచక్ర వాహన నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. శింగనమల చెందిన ఆశా వర్కర్ పద్మావతి శనివారం కావడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వేసే వ్యాక్సిన్‌ను తెచ్చేందుకు తన కుమారుడి ద్విచక్రవాహనంలో ఉదయం తరిమల పీహెచ్‌సీకి వెళ్లారు. అక్కడి నుంచి వాక్సిన్ తీసుకుని వస్తున్నారు. మార్గమధ్యంలో గోవిందరాయుని పేట సమీపంలో రైతులు రోడ్డుపై ఏర్పాటు చేసుకున్న పైపులైన్ గుంతను దాటుతున్న సమయంలో ఆమె ద్విచక్రవాహనం నుంచి కిందికి పడ్డారు. తలకు తీవ్రగాయం కావడంతో శింగనమల ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా మండల ఆశావర్కర్లు మాట్లాడుతూ తరిమెల ఆసుపత్రిలో వ్యాక్సిన్ తీసుకుని వచ్చే ఎంపీహెచ్‌ఓ(మేల్) పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రతి శనివారం తరిమెల లేక సలకంచెరువుకు వెళ్లి వ్యాక్సిన్ తెచ్చేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

మెరుగైన వైద్యమందించాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆశావర్కర్ పద్మావతికి మెరుగైన వైద్యం అందించి, ప్రమాదానికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. శానివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లతో కలిసి డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ... మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రమాదం జరిగితే సాయంత్రం 6 గంటలైనా మెరుగైన వైద్యం అందించలేదని వాపోయారు. ఆశాలకు సంబంధం లేని పనులన్నీ వారితో చేయిస్తున్నారని వాపోయారు. అనంతరం అక్కడికి చేరుకున్న డీఎంహెచ్‌ఓ దేవికి వినతిపత్రం సమర్పించి సమస్యను వివరించారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ



పరికరాలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ,సూపరింటెండెంట్

అనంతపురం టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆస్పత్రి ఆవరణంలో శనివారం దివ్యాంగ చిన్నారులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు, వినికిడి యంత్రాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన ఒమేగా స్వచ్ఛంద సంస్థ దాదాపు 50మందికి ఈ పరికరాలు అందించడానికి ముందుకొచ్చింది. వాటిని డీఎంహెచ్‌ఓ, డాక్టరు ఈబీ దేవి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు చేతులమీదుగా ఆ పిల్లలకు అందజేశారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి. మేనేజరు రజిత, ఒమేగా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలకు ల్యాబ్ మెటీరియల్ వితరణ

శింగనమల, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి రూ. 5 వేలు విలువ గల సైన్స్, మ్యాథ్స్ ల్యాబ్ మెటీరియల్ వితరణ చేశారు. శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులకు వాటితో పాటు 30 జతల క్రీడా దుస్తులు అందజేశారు. పూర్వ విద్యార్థులు శ్రీకాంత్‌రెడ్డి దామోదర్‌నాయుడు, సర్పంచ్ రాజు, విద్యాకమిటీ ఛైర్మన్ వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బాలికల మృతి బాధాకరం

● ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకింద కల్లూరులో సమీపంలో నీటి కుంటలో పడి లక్ష్మి (15), అరుణ (9) అనే ఇద్దరు బాలికలు మృతి చెందారు. విషయం తెలుసుకున్న శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులు నీటి కుంటలో పడి మృతి చెందడం ఎంతో బాధకరమన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఒక్కక్క కుటుంబానికి రూ. 10వేలు చొప్పున రూ. 20వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా గుడ్డాలపల్లిలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన నలపరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. నాయకులు ఎంపీటీసీ సురేంద్రనాథ్‌రెడ్డి, పాండు, సుధాకర్‌రెడ్డి, వడ్లరాము, బాబయ్య, ఆశోక్‌కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'రూ.90లక్షలతో పరారీ'

అనంతపురం క్రైం, మార్చి15(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని హార్మోన్ సిటీ సంస్థలో పనిచేస్తున్న ఓ వ్యక్తి రూ.90 లక్షలతో పరారైనట్లు గోల్డెన్ గ్లోబ్ సంస్థ ప్రతినిధులు శనివారం విలేకరులతో తెలిపారు. అందరినీ మోసం చేసి డబ్బు తీసుకెళ్లాడని ఏడాదిన్నర క్రితం వెలుగు చూసిందన్నారు. ఈ ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటివరకు గడువు కోరాడని కానీ ఇప్పటివరకూ ఒక్క రూపాయ కూడా ఇవ్వలేదన్నారు. దీంతో మరోసారి పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

పండ్లతోటకు నిప్పు

● కాలిపోయిన మామిడి, నేరేడు చెట్లు

అనంతపురం రూరల్, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచానపల్లి సమీపంలో మాజీ సైనికుడు, రైతు వైఆనంద్‌రెడ్డికి చెందిన పండ్లతోట అగ్నికి ఆహుతైంది. తోటలోని మామిడి, నేరేడు చెట్లు కాలిపోయాయి. బాధితుడు ఆనందరెడ్డి రాచానపల్లి సర్వే నెంబరు 30లో 3.37ఎకరాల్లో నేరేడు, మామిడి చెట్లు పదెనిమిదేళ్లగా సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంట పూత, పిందె దశలో ఉంది. ఈ ఏడాది పంట కోసం ఇప్పటి వరకు పెట్టుబడుల రూపంలో రూ.3లక్షల వరకు పెట్టినట్లు బాధిత రైతు తెలిపారు. శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు తోటకు ఏర్పాటు చేసిన ముళ్ల కంచెకు నిప్పుపెట్టడంతో మంటలు తోటకు వ్యాపించాయని తెలిపారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారన్నారు. దీనివలన కొంత నష్టం తగ్గిందన్నారు. అధికారులు తగు న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా పంటకు నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరారు.


పరీక్ష కేంద్రాల నుంచి కేరింతలతో బయటకు వస్తున్న విద్యార్థులు


బస్సుల్లో విద్యార్థుల కేరింతలు

ఉరుకులతో ఊరికి..!

● సొంతూళ్ల బాట పట్టిన విద్యార్థులు ● కిక్కిరిసిన బస్టాండ్లు

అనంతపురం కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి హాస్టళ్ల, ప్రైవేట్ గదుల్లో అద్దెకు ఉండి రెండేళ్లపాటు కొనసాగిన ఇంటర్మీడియట్ చదువులు శనివారం నాటికి ముగిశాయి. ద్వితీయ సంవత్సరం పరీక్షలు పూర్తయ్యాయి. తల్లిదండ్రులతో సొంతూరిలో సరదాగా గడపడం కోసం ఎపుడెపుడా అని నిరీక్షించిన విద్యార్థులకు ఆ సమయం వచ్చేసింది. పరీక్షలు ముగిసిన వెంటనే సొంతూళ్ల ఉరుకులు పరుగులు పెట్టారు. పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వస్తూనే కేరింతలతో సందడి చేశారు. ఆటోలు, బస్సుల్లో ఈలలు వేస్తూ ఉత్సాహంగా ఇంటి బాట పట్టేశారు. ఊళ్లకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులతో జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి. రద్దీ నేపథ్యంలో శనివారం కూడా ఆర్టీసీ అధికారులు అదనపు సర్వీసులేవీ కేటాయించకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. పరీక్షలు ముగిసిన అనంతరం మధ్యాహ్నం 12.15 నుంచి 1.20 గంటల వరకు ఆర్టీసీ బస్టాండు వెలుపలి రోడ్డు, శ్రీకంఠం సర్కిల్‌తోపాటు పలు ప్రధాన కూడళ్లు ట్రాఫిక్‌తో స్తంభించిపోయాయి.


మూటాముల్లె సర్దుకుని సొంతూరి బాట


బస్టాండులో విద్యార్థుల కిటకిట


సీట్ల కోసం ఫీట్లు .. పాట్లు

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలి

● అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన
● రామగిరిలో ప్రజా దర్బార్


ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రెవెన్యూ సమస్యలను జఠిలం చేసుకోకుండా రాజీ మార్గంలో వెళితే ఇరువర్గాలకు నష్టం ఉండదని ఆమె అభిప్రాయపడ్డారు. మండల కేంద్ర మైన రామగిరిలో పంచాయతీ రాజ్ శాఖ గెస్ట్‌హౌస్‌లో శనివారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో ప్రధానంగా భూ వివాదాలు, పింఛన్లు, హౌసింగ్, వీధిలైట్ల సమస్యలు వచ్చాయి. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... భూ వివాదాలను కోర్టు వరకు తీసుకెళ్లితే అవి పరిష్కారమయ్యేందుకు చాలా సమయం పడుతుందన్నారు. రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పేర్ల మార్పు, భూ కబ్జాలు వంటి వాటిపై అధికారులు తగిన చర్యలు తీసుకో వాలన్నారు. త్వరలోనే కొత్తపింఛన్లు, ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, నాయకులు రామ్మూర్తినాయుడు, పరంధా మయాదవ్, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, తెలుగుయువత నాయకుటు శ్రీధర్‌నాయుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, నాగేశ్‌నాయుడు, పేపర్‌శీన, అక్కులప్ప, పోలేపల్లి చంద్రప్ప, ఎస్ ఆంజనేయులు, విశ్వనాథ్, కోనంకి ముత్యాలు, గంగిరెడ్డి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎమ్మెల్యే

రామగిరి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఊరు శుభ్రంగా ఉంటుందని ఎమ్మెల్యే పరిటాలసునీత పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రామగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణంలో ఎమ్మెల్యే పరిశుభ్రత చర్యలు చేపట్టడంతో పాటు మొక్కలను నాటారు. ఆస్పత్రి ఆవరణం శుభ్రంగా ఉంచడంపై వైద్యులు, సిబ్బందిని అభినందించారు. ఆస్పత్రిలో ప్రసవమైన మహిళను పరామర్శించి బాలింతకు పాలు, బ్రెడ్లు పంపిణీచేశారు. అక్టోబరు 2 తరువాత సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలోనైనా ఆకస్మికంగా స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొంటా రని, అధికారులు ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా చూడలని సూచించారు. అదేవిధంగా మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రాన్స్‌కో ఈఈ శివరాములు,డీ ఈ లక్ష్మీనారాయణ, ఏఈ వెంకటేశులు, లైన్‌మెన్ పరమేశ్ తదితరులు పాల్గొని స్వచ్ఛభారత్‌పై ప్రతిజ్ఞ చేశారు.

పబ్లిసిటీ కోసమే మాజీ ఎమ్మెల్యే డ్రామాలు

● టీడీపీ నాయకులు

కనగానపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయి, సొంతపార్టీ వారే పట్టించుకోక పోవడంతో పబ్లిసిటీ కోసం మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డ్రామాలాడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధాకర్‌చౌదరి, మండల కన్వీనర్ యాతం పోతలయ్య విమర్శించారు. దాదులూరు వద్ద పోలీ సులు అడ్డుకోవడంపై ప్రకాష్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. మండలంలోని మామిళ్లపల్లిలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పోలేపల్లికి ముందస్తుగా ప్రకాష్‌రెడ్డి అనుమతి తీసుకోక పోవడంతో పోలీసులు వెనక్కు పంపారన్నారు. మా వద్ద తుపాకులు ఉన్నాయని వాఖ్యలు చేయడం ప్రశాంతంగా ఉన్న గ్రామా ల్లో చిచ్చురేపడమే నన్నారు. హంద్రినీవా లైనింగ్ పనుల గురించి ఎమ్మె ల్యే పరిటాల సునీతపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గత వైసీపీ హయాంలో రాంక్రీట్ సంస్థ హౌసింగ్ పేరుతో ప్రజాసొమ్ము దోచుకుందని, సంబంధీకులు ప్రతి ఒక్కరూ జైలుకెళ్ళక తప్పదన్నారు. టీడీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, తలారి రాజప్ప, నరేంద్రరెడ్డి, నరసింహులు, నారాయణస్వామి, సంజీవరెడ్డి, ఓబుళపతి పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

● మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ మహబూబ్‌బాషా

అనంతపురం అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అనంతపురం మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ మహబూబ్ బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక మహిళా పోలీసు స్టేషన్‌లో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పీఎండీ షఫి, ఉమ్మడి జిల్లా కో - ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, లీగల్ సలహాదారుడు జెన్నే ఆనంద్, కార్యదర్శి రసూల్ డీఎస్పీని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తెలుగులో రూపొందించిన దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకాలను డీఎస్పీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆ సంఘం నాయకులు పెద్దన్న, లక్ష్మీదేవి, లక్ష్మన్న, పక్కీరప్ప, చంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ అధ్యయనం అలవర్చుకోవాలి

● డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ప్రాజెక్టు ఏపీసీ శైలజ

అనంతపురం విద్య, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు బాల్యం నుంచే శాస్త్రీయ అధ్యయనం అలవర్చుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ప్రాజక్టు ఏపీసీ శైలజ పేర్కొన్నారు. శనివారం సైన్స్ సెంటర్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. పలు అంశాలపై పోటీ పరీక్షలు నిర్వహించారు. 145 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా డీఈఓ, ఏపీసీ మాట్లాడుతూ...పోటీలో పెట్టిన అంశాలు ఎంతో సామాజిక స్పృహతో కూడుకున్నవన్నారు. ప్రతి అంశాన్ని శాస్త్రీయ కోణంలో చూడాలని, సత్యాన్ని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో బాలమురళీకృష్ణ, ఆనందభాస్కర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ
● 220కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం


జంతులూరులో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండల పరిధిలోని జంతులూరులో రూ. 2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే శనివారం ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తున్నాయన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు పగటి పూట అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నూతనంగా సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ శేషాద్రి, డీఈ రమేష్, ఏడీ రఘు, ఏఈ ప్రతాప్, టీడీపీ నేతలు పసుపుల శ్రీరామిరెడ్డి, ఎంపీపీ సునీత, ఓబులపతి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

శింగనమల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అందజేశారు. ఎమ్మెల్యే శనివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 18 మంది బాధితులకు రూ. 22,12,600 చెక్కులను అంజేశారు.

ఎట్టకేలకు ఎంఎస్ఎంఈల సర్వే పూర్తి

● మూడున్నర నెలలుగా కుస్తీ
● తొలి రెండు నెలల్లో నత్తనడకన
● కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణతో కొలిక్కి


నగరంలో సర్వేపై ఆరా తీస్తున్న కలెక్టర్ (ఫైల్)

అనంతపురం అర్బన్, మార్చి 15(ఆంధ్రజోతి) : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల సర్వే ఎట్టకేలకు పూర్తైంది. మూడున్నర నెలల కుస్తీ నేపథ్యంలో సర్వే వంద శాతం పూర్తి కావడంతో సంబంధిత అధికారులు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. పారిశ్రామిక వేత్తలు, వ్యాపారుల వివరాలను నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందేందుకు అవకాశం ఉంది. గత ఏడాది నవంబరు ఆఖరు వారంలో ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది జనవరి నెలాఖరుతో తొలుత విధించిన గడువు ముగిసింది. అయితే అప్పటి దాకా కేవలం 37.26 శాతం యూనిట్లపై సర్వే చేయడంతో సరిపెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ దాకా గడువు పొడిగించారు. సర్వే నత్తనడకగా సాగుతోందని ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి ఈ నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతం చేసేందుకు నిరంతర పర్యవేక్షణ పెట్టారు. సంబంధిత అధికారులతో తరచూ సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ వచ్చారు. పరిశ్రమల శాఖలోని కొందరు అధికారులకు నగరంలోని డివిజన్లల్లో పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. పలు ప్రాంతాల్లో ఆయన స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి, సర్వేపై ఆరా తీశారు. ఈ పరిస్థితుల్లో గడువులోగా ఎట్టకేలకు జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వే విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా 89,666 ఎంఎస్ఎంఈలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆఖరు గడువు శనివారం నాటికి వంద శాతం ఎంఎస్ఎంఈలను సర్వే చేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం నివేదికలు పంపింది.

ఏపీపై ఎప్పటికీ సీఎం చంద్రబాబు మార్క్

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌పై సీఎం చంద్రబాబునాయుడు మార్క్ ఎప్పటికీ ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ చరిత్రలో సీఎం చంద్రబాబుకు ఉన్న రికార్డు మరెవరికీ లేదని, భవిష్యత్‌లోనూ ఉండబోదన్నారు. సీఎం చంద్రబాబు అసెంబ్లీలో తొలి ప్రమాణ స్వీకారానికి 47 సంవత్సరాలు పూర్తైందన్నారు. రాష్ట్ర చరిత్రలో 41 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, 15 సంవత్సరాలు సీఎంగా ఉన్న నాయకుడు మరెవరూ లేరన్నారు. భవిష్యత్‌లోనూ మరెవరూ ఉండరన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం తన అదృష్టమని, ఎప్పటికీ ఆయన మాకు స్ఫూర్తిగా ఉంటారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు

ఇటుకలపల్లి సబ్‌స్టేషన్ వద్ద మన్నీల రైతుల ఆందోళన

అనంతపురం రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాలతో ఇబ్బందులు పడుతున్నామని మన్నీల గ్రామ రైతులు అన్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం మండలంలోని ఇటు కలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు. మండల ఏఈతో సరఫరాలో నెలకొన్న సమస్యలతో వాదనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..గత కొంత కాలంగా ఆకుతోటపల్లి ఫీడర్‌లో వ్యవసయానికి కరెంటు సరిగా సరఫరా కావడం లేదన్నారు. నిత్యం బ్రేక్‌డౌన్లు, ఇతరత్ర సమస్యల కారణంగా గంటల కొద్దీ కరెంటు సరఫరా నిలిచిపోతోందన్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. పంట దశలో కరెంటు సమస్యలతో ఇబ్బందులు రావడంతో ఆ ప్రభావం దిగుబడులపై పడుతోందన్నారు. తక్షణం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

అరటికి మద్దతు ధర కల్పించండి

● పండ్ల తోటల రైతు సంఘం నాయకుల వినతి

అనంతపురం అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాగు అవుతున్న అరటి పంటకు మద్దతు ధర కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని పండ్ల తోటల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావుకు ఆ సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప, సహాయ కార్యదర్శి సంజీవరెడ్డి శనివారం వినతి పత్రం అందజేశారు. జిల్లాలో 30వేల ఎకరాల్లో అరటి పంట సాగుచేస్తున్నారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో టన్ను రూ.26వేలతో వ్యాపారులు కొనుగోలు చేశారన్నారు. దీంతో రైతులు గిట్టుబాటు ధర వచ్చిందని సంతోషించారన్నారు. ఆ తర్వాత కొందరు దళారులు కుమ్మకై టన్ను అరటి రూ.13వేల నుంచి రూ.14వేలకు తగ్గించారన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆ సంఘం నాయకులు శ్రీనివాసులు, వెంకటకొండ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

అనంతపురం రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలం లోని కురుగుంట గ్రామం వైఎస్సార్ కాలనీలో నివాసముంటున్న పావురాల వలి అనే వ్యక్తి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తెలుగు రైతు నియోజకవర్గం అధ్యక్షు డు నారాయణ స్వామి శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. తన వంతు సాయం రూ. 5వేలు అందజేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు ధర్మేంద్ర, జాఫర్, రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

బుక్కరాయసముద్రం, మార్చి15 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మండల కేంద్రంలో సితార(26) అనే మహిళ శనివారం ఆత్మహత్య చేసుకుంది. ఉత్తర కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రవీణ్‌మోర్, భార్య సితార బుక్కరాయసముద్రంలోని నార్పల క్రాస్ వద్ద ఐదు నెలలు క్రితం బేకరీ దుకాణం పెట్టారు. గత కొంత కాలంగా వీరు చిన్నపాటి గొడవలు పడేవారు. దీంతో మనస్థాపం చెంది సితార శనివారం వేకువజామున ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సితార ఉన్న బెడ్‌రూమ్ వాకిలి తీయకపోవడంతో అనుమానం వచ్చి వాకిలి పగలి కొట్టి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మందికి మెమోలు

అనంతపురం క్రైం,మార్చి15(ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం చేసినందుకు నలుగురు ఆర్ఐలు, నలుగురు వార్డు అడ్మిన్‌లకు నగరపాలిక అధికారులు మెమోలు జారీ చేశారు. శనివారం నగర పరిధిలోని ఐదు సచివాలయాల పరిధిలో జీరో కలెక్షన్ ఉండటంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వారికి డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు మెమోలు జారీ చేశారు.

స్వచ్ఛాంధ్ర నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

● వక్తలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రత్యేకంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ పాల్గొనాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కోసం శనివారం స్థానిక డీఆర్‌డీఏలో పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు.

● అనంతపురం క్రైం : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాష అన్నారు. శనివారం ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నగర ప్రజలు సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి అన్నారు. పాతూరు గాంధీ విగ్రహం వద్ద స్వ ర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

● అనంతపురం టౌన్ : మనశుభ్రత మనచేతుల్లోనే ఉందని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ దేవి , ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలో, జిల్లా సర్వజన ఆస్పత్రిలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

● అనంతపురం కల్చరల్ : ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అనంతపురం బస్టాండులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. బస్టాండు మేనేజర్ మూర్తి, రామంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య ఆధ్వర్యంలో మండలంలోని లోలూరు, ఆకులేడు గ్రామాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై ర్యాలీలు నిర్వహించారు.

● గార్లదిన్నె: ఎంపీడీఓ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం అవరణంలో స్వరాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న కంకులతోతో తయారు చేసిన బ్యాగులను పంపిణి చేశారు.

● కనగానపల్లి: స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విద్యార్థులు శనివారం మండల వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్, టీడీపీ రాష్ట్రకార్యదర్శి నెట్టెం వెంకటేష్ పాల్గొన్నారు.

● రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లిని ప్లాస్టిక్ రహిత గ్రామంగా మార్చుదామని డీఎల్‌డీఓ లలితాబాయి, ఎంపీడీఓ విజయ లక్ష్మీ తెలిపారు. గొందిరెడ్డిపల్లిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.


డీఆర్‌డీఏ కార్యాలయం ఆవరణలో శుభ్రం చేస్తున్న పీడీ ఈశ్వరయ్య, అధికారులు

సంక్షిప్త వార్తలు

బొలికొండ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

గుత్తిరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి కి శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అలాగే భూదేవి, శ్రీదేవి సమేత స్వామి ఉత్సవవిగ్రహాలను అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అపులాపురం అంజన్నకు ..

రాయదుర్గంరూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అపులాపురం ఆంజనేయస్వామి, మల్లాపురం సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. వేకువజామునే అర్చకులు స్వామివార్ల మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అశ్వవాహనంపై చెన్నకేశవుడు

యాడికి, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శివలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తిని అశ్వవాహనంపై ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఓబులేసు ఉత్సవాలు ప్రారంభం

యల్లనూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఓబులేసు స్వామి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు శుక్రవారం రాత్రి నుంచే స్వామివారికి కాయకర్పూరంతో పాటు బియ్యం, బేడలు ఆలయం వద్ద సమర్పించారు. శనివారం ఉదయం స్వామివారి ఉత్సవవిగ్రహాన్ని ప్రత్యేక అలంకరణచేసిన ఎద్దుల బండిపై ఉంచి గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం స్వామివారిని ఎద్ల బండిపై బొప్పేపల్లి వద్ద ఉన్న కోనగుడి వద్దకు సాగనంపారు. ఊరేగింపులో ప్రత్యేక డప్పులు, కోలన్న ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఆదివారం తెల్లవారుజామున తిరిగి స్వామివారు గ్రామంలోకి తీసుకువస్తామని నిర్వాహకులు తెలిపారు.

నెట్టికంటి సన్నిధిలో పత్తికొండ ఎమ్మెల్యే


హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

గుంతకల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాన్ని కర్నూలు జిల్లా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు శనివారం సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అలాగే పూజలు, అర్చనలు జరిపించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ పిడికిటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

విడపనకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలపల్లిలో బావికాటి రంగప్ప, లక్ష్మమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు పాల్గొని 130 మందికి కంటి పరీక్షలు చేసి 50 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వైద్యుడు జయకుమార్ నాయక్, ట్రస్టు అధ్యక్షుడు బావికాటి భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల తనిఖీ

విడపనకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని విడపనకల్లు, పెద్ద కొట్టాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌ఓ ఈ బీ దేవి శనివారం శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటుతో ఉండి మెరుగైన వైద్యసేవలు అందిచాలని సూచించారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.వైద్యులు పుష్పా, జయకుమార్ పాల్గొన్నారు.

మార్కెట్ సుంకం టెండర్ వాయిదా

గుంతకల్లు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో సుంకం వసూలు టెండర్‌ను వాయిదా వేసినట్టు కమిషనర్ నయీం అహ్మద్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరగాల్సి ఉన్న ఈ టెండరును కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు.

పోరంబోకు భూమిలో సాగు చేస్తే కఠినచర్యలు

బొమ్మనహాళ్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరేసముద్రం గ్రామానికి తాగునీటి సరఫరా చేసే ట్యాంకు చుట్టూ ఉన్న పోరంబోకు భూముల్లో ఎవరైనా పంటలు సాగు చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మునివేలు హెచ్చరించారు. ట్యాంకు చుట్టూ వ్యవసాయం సాగు చేసి పంటలకు క్రిమిసంహారక మందులు వాడుతుండటం వల్ల ఆ మందు ప్రభావం ట్యాంకులోని నీటిపై పడుతోంది. దీంతో టీడీపీ నాయకుడు పల్లి తిప్పేస్వామి ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆ భూములు పరిశీలించి అక్కడ బోర్డును ఏర్పాటు చేశారు. 271 ఏ సర్వే నెంబర్‌లో పోరంబోకు భూముల్లో సాగు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్ తిప్పేస్వామి, వీఆర్వో నాగరాజు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కుందుర్పి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబుగుంపల గ్రామంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచనల మేరకు శనివారం టీడీపీ నాయకులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, జంబుగుంపల, కెంచంపల్లి, కొలిమిపాళ్యం, అప్పాజీ పాళ్యం, కలిగులిమి గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

పెద్దవడుగూరు, మార్చి15(ఆంధ్రజ్యోతి): ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కోటకొండ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శనివారం ఆయన గ్రామ ప్రజలతో సమావేశమై మాట్లాడారు. ఉగాదికి ఈ ఆలయానికి భక్తులు పెద్దఎత్తున వస్తారన్నారు. తగు ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డికి సూచించారు. ముందుగా ఆయన స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ దివాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, సర్పంచు రాము పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


పరీక్ష ప్యాడ్‌లను అందిస్తున్న కాలవ భరత్

రాయదుర్గంరూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థినులకు సేవా భారత్ ట్రస్ట్ పరీక్ష సామగ్రి పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ముఖ్యఅతిథిగా హాజరై వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు గంగాధర్, ఏబీవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్, కేజీబీవీ ఎస్‌ఓ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయురాళ్లు, పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

● స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో కలెక్టర్ వినోద్‌కుమార్


గుంతకల్లులో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉండగలుగుతారని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. గుంతకల్లు మండలంలోని గుండాలతండా గ్రామంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అలాగే మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతూ.. పల్లెల్లో, పట్టణాల్లో ఎక్కడా కూడా అపరిశుభ్రత కనిపించకూడదన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దారు రమాదేవి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, ఎంపీపీ మాధవి, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుంతకల్లు పట్టణంలో మధ్యాహ్నం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రా సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై అక్కడున్నవారితో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత పలువురు వివిధ సమస్యలపై ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, కమిషనరు నయీం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఇక బొమ్మనహాళ్ మండల కేంద్రంతో పాటు దర్గాహొన్నూరు, ఉద్దేహాళ్ గ్రామాల్లో, విడపనకల్లు మండలకేంద్రంతో పాటు పెద్ద కొట్టాలపల్లి, పాల్తూరు గ్రామాల్లో, గుమ్మఘట్ట, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, యాడికి, పెద్దవడుగూరు, బెళుగుప్ప మండల కేంద్రాల్లో, గుత్తి, తాడిపత్రి, కళ్యాణదుర్గం పట్టణాల్లో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య చర్యలు చేపట్టారు. అలాగే పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, రాకెట్ల పీహెచ్‌సీలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లోకి చేపపిల్లలు


రిజర్వాయర్‌లోకి చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

పెద్దపప్పూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగల్లు రిజర్వాయర్‌లోకి శనివారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, ఇతరులు కలిపి 2,93,000 చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంతోనే మత్స్యకారుల అభివృద్ధి సాధ్యమన్నారు. గతంలో పాలకులు మత్స్యకారులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. నేటి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమంతో పాటు వారికి పింఛన్ వెసులుబాటు కూడా కల్పించిందని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న మత్స్యకారులకు ఎటువంటి సమస్య వచ్చినా తమకు తెలియజేయాలని, పరిష్కరిస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీఓ శకుంతల, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, జిల్లా చేపల సంఘం డీడీ శ్రీనివాసనాయక్, వీడీఓ పక్కీరయ్య, జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు నాగేష్, మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు లోకనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న జేసీపీఆర్

యాడికి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శివలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. పోటీలను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, వేలూరు రంగయ్య, రాజప్ప, రుద్రమనాయుడు, రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతపురం, నంద్యాల, కర్నూలు, కడప జిల్లాలకు చెందిన 12జతల దూలపు ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు నిర్వాహకులు మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండోబహుమతి రూ.80వేలు, మూడో బహుమతి రూ.60 వేలు, నాలుగో బహుమతి రూ.40వేలు, ఐదో బహుమతి రూ.20వేలు బహూకరించారు. పోటీలను చూడడానికి రైతులు వేలసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ సునీల్‌కుమార్, బీజేపీ మండల కన్వీనర్ చింతా చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి పగటి కలలు కనాల్సిందే..

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ రెడ్డి మరో 15 ఏళ్లు అధికారంలోకి వచ్చే అవకాశం లేదని, ఆయన పగటి కలలు కనడం తప్పా చేసేదేమీ లేదని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విమర్శించారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద 15 మంది లబ్ధిదారులకు ఆయన సీఎం సహాయనిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందన్నారు. అందుకే 2024 ఎన్నికల్లో ప్రజలు అంత ఘోరంగా ఓడించారని అన్నారు. ఇప్పుడేమో మళ్లీ మేమే అధికారంలోకి వస్తామని జగన్ చెబుతుడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో ఇద్దరి వైసీపీ కుటుంబాలకు కూడా సీఎం సహాయ నిధి చెక్కులు అందించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని కొనియాడారు. 15 మంది లబ్ధిదారులకు రూ.18.64 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశామన్నారు. అదేవిధంగా ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్తకు రూ. 6.50 లక్షలు, మరొకరికి రూ.3.50 లక్షల చెక్కులను అందించినట్లు చెప్పారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గంరూరల్/ బొమ్మనహాళ్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఎంఈఓలు నాగమణి, వెంకటరమేష్ పేర్కొన్నారు. పట్టణంలోని పరీక్ష కేంద్రాలను శనివారం వారు పరిశీలించారు. పట్టణంలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటిల్లో 1491 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్షలు రాసే విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు హాల్‌టికెట్ చూపిస్తే ఉచితంగా బస్సు సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే బొమ్మనహాళ్ మండలంలో 18 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 888 మంది పదో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల కోసం మండలంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున తెలిపారు.

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం: టీడీపీ

ఉరవకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం తట్రగల్లు వంక నుంచి పందికుంట చెరువుకు హంద్రీనీవా నీరు అందించడానికి వెళ్లే మార్గాన్ని టీడీపీ నాయకులు శనివారం పరిశీలించారు. పందికుంట చెరువుకు నీరు ఇస్తామని ఎన్నికల్లో పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారని , దీంతో ఆయన ఆదేశాల మేరకు మైనర్ ఇరిగేషన్ అధికారులతో చర్చించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్, మండి ఎర్రిస్వామి, ప్యాపిలి నాగన్న, కావలి వెంకటేశులు, గొల్ల వెంకటేశులు, రామకృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల బైక్‌ర్యాలీ

ఉరవకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయకార్మిక సంఘం నాయకులు శనివారం ఉపాధి పనుల వద్దకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో పనులు జరిగే ప్రాంతాలకు బైక్‌ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కూలీలు పనిచేసే చోట కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పని ప్రాంతాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏపీ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, వెంకటేష్, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

రూ. 10 వేల ఆర్థికసాయం

కళ్యాణదుర్గం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కుందుర్పి మండలకేంద్రానికి చెందిన రాము పాముకాటుతో కాలు కోల్పోయాడు. బాధితుడికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ రూ. 10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. పట్టణంలో ట్రస్ట్ కార్యాలయంలో శనివారం బాధితుడి కుటుంబసభ్యులకు నగదు అందజేశారు.

ఎస్‌వీఐఎస్ పాఠశాలలో వార్షికోత్సవం

గుంతకల్లు, మార్చి15(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కొనకొండ్ల రోడ్డులో ఉన్న ఎస్‌వీఐఎస్ ఉన్నత పాఠశాల 24వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. ఇందులో ఏపీ ఉన్నత విద్యామండలి మాజీ చైర్మెన్ హేమచంద్రారెడ్డి, ఎంఈవోలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు, హెచ్‌ఎంలు నాగమణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడిపత్రి ఇంజనీరింగ్ కాలేజీలో..

తాడిపత్రి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో ఉన్న తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల 15వవార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు కళాశాల చైర్మన్ రమేష్‌రెడ్డి, సెక్రటరీ సురేష్‌రెడ్డి, సిబ్బంది హాజరయ్యారు.

ఇంటి స్థలాల కోసం వినతి

శెట్టూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లిలో ఉన్న నిరుపేదలకు ఇంటి స్థలాలను ఇవ్వాలని శనివారం ఆ గ్రామ ప్రజలు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టిని మండలకేంద్రంలో శనివారం కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 291బీలో ఖాళీగా వున్న స్థలాన్ని గుర్తించి తక్షణమే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. గ్రామస్థులు హనుమంతరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, ఆనంద్, వన్నూరురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా .. ఒకరికి తీవ్రగాయాలు

కూడేరు, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్కూరు గ్రామ సమీపంలో కారు బోల్తా పడటంతో అందులోనున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. రామ్మోహన్‌రెడ్డి అనే వ్యక్తి కారులో గొట్కూరు గ్రామంలోకి వెళ్తాండగా.. రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి కారు దిగి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అతడి తలకు గాయాలయ్యాయి. స్థానికులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

15 సపోటా చెట్లు దగ్ధం

తాడిపత్రి, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలో రైతు విష్ణువర్ధన్‌రెడ్డికి చెందిన 15సపోటా చెట్లు కాలిపోయాయని అగ్నిమాపక అధికారులు తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న తోట వద్ద గట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు గట్టుకు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగి తోటలోని చెట్లు కాలిపోయాయన్నారు. సమయానికి తాము చేరుకొని మంటలను అదుపులోకి తీసుకుకొచ్చామని చెప్పారు.

గడ్డంవారిపల్లిలో స్వల్ప ఘర్షణ

యల్లనూరు, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డంవారిపల్లిలో శనివారం సాయంత్రం స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రఘు, రాంజిల్‌రెడ్డి, నారాయణరెడ్డికి మధ్య పొలం తగాదా ఉంది. ఈ విషయంలో వారు వాగ్వాదం చేసుకుని దాడి చేసుకున్నారు. ముగ్గురికి గాయాలు కావడంతో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజాదర్బార్‌లో 223 ఫిర్యాదులు

● ప్రతి శనివారం కార్యక్రమం చేపడతామన్న ప్రభుత్వ విప్ కాలవ


వృద్ధురాలి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 223 ఫిర్యాదులు అందినట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం మధ్యాహ్నం2 గంటల వరకు కొనసాగింది. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి వివిధ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను సమర్పించారు. కాలవశ్రీనివాసులు వాటిని స్వీకరించి తక్షణం పరిష్కారం అయ్యే సమస్యలను అక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి శనివారం ప్రజాదర్బార్‌ను నిర్వహించి సమస్యలను పరిష్కరించేందుకు ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరాళ్ల పురుషోత్తం, పార్టీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రాయదుర్గంరూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయనిధికి సంబంధించిన చెక్కులను ప్రభుత్వవిప్ కాలవ శ్రీనివాసులు లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని తన నివాసంలో ఆయన రూ. 6,45,800లకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే నియోజకవర్గంలోని 10 మహిళా సంఘాల సభ్యులకు ఆయన పీఎంఏజేపై స్కీం కింద మంజూరైన రూ. 18.50 లక్షల చెక్కును పంపిణీ చేశారు. సీసీలు, ఆనిమేటర్లు పాల్గొన్నారు.

కాలవకు సన్మానం

రాయదుర్గంరూరల్: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో ఎస్టీ పునరుద్ధరణ అంశంపై గళం వినిపించిన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు వాల్మీకి సంక్షేమ సేవా సంఘం రాయదుర్గం అధ్యక్షుడు బండి క్రిష్టప్ప, ఉపాధ్యక్షుడు మలకన్న తదితరులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పట్టణంలోని నివాసంలో వారు ఆయన్ను సన్మానించారు. వాల్మీకి సంక్షేమ సేవా సమితి న్యాయ సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.